## అక్రమ కేసులను వెంటనే ప్రభుత్వం ఎత్తి వేయాలి

- సిఎం ముఖ్య సలహాదారుకు విజ్ఞప్తి చేసిన రాజన్న



**శెనార్తి మీడియా, జగిత్యాల:**

గత బిఆర్ ఎస్ ప్రభుత్వ హయాములో తెలంగాణ ఆర్టీసి కార్మికులపై, ఉద్యమ కారులపై రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా పెట్టిన కేసులను మన ప్రభుత్వం ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ముఖ్య సలాహాదారు వేమ్.నరెందర్ రెడ్డి కి జగిత్యాల ఉద్యమకారుడు మహంకాలి రాజన్న విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లో స్వయంగా ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసి సమస్యల పట్ల కార్మికులు 2019లో చేసిన సమ్మె కాలంలో పోలీసులు అన్యాయంగా అక్రమ కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. జగిత్యాలలో మూడు కేసుల ద్వారా 43 మంది, ఇలా రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో అనేక మంది తప్పుడు కేసులతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ఇలాంటి అన్ని అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బాధిత కార్మికులను, ఉద్యమకారులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## జంగపల్లి సిపిఐ గ్రామ కమిటీ ఎన్నిక



**శెనార్తి మీడియా, గన్నేరువారం**

గన్నేరువారం మండలంలోని జంగపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల సిపిఐ నాయకుడు పిప్పల కనుకయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాడు. గ్రామ గ్రామాన ఎర్రజెండా ఎగురవేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చాడు.ఈ సందర్భంగా సిపిఐ గ్రామ కమిటీకి కొత్త పదవాధికారులను ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా కోతి సంపత్, సహాయ కార్యదర్శిగా అందె రాజయ్య, కోశాధికారిగా కోతి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కోతి మహేష్, కర్రె చంద్రారెడ్డి, అనవేణి సంపత్, కోతి మల్లయ్య, కోతి శంకరి, బొజ్జ రాజయ్య, బొజ్జ శ్రీనివాస్, వరుకొలు నర్సయ్య, పేరోజు సుమన్, హనుమండ్ల చంద్రయ్య, వాలా జగన్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాలకు కిట్లు పంపిణీ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని, క్రీడాకారులు ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖాధికారి కీర్తి రాజ్ వీరు తో కలిసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు అందించిన క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సందర్భంగా ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా సెంటర్ బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేష్, ఫుట్బాల్, వాలీబాల్, కరాటే శిక్షకులు వనిత, పున్నం చందు, రవి తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతపై ప్రత్యేక శ్రద్ధ

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

విద్యతో జీవితం మారుస్తుందని, చదువుతో సమాజంలో గౌరవం లభిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కాసిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరాస్యత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.జిల్లాలోని వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులకు రాత్రి తరగతులు నిర్వహించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం కాసిపేట మండలంలో ప్రారంభమై మరిన్ని ప్రాంతాలకు విస్తరించనుంది.గ్రామపంచాయతీలకు 2 కుట్టు మిషన్ల చొప్పున అందజేయడం జరిగిందని, ఈ కుట్టు మిషన్లతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. అలాగే, అటవీ భూములు, పోడు భూములలో వెదురు సాగుకు అవకాశం ఉందని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిజిల్లాలో 50 పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

# భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

**శెనార్తి మీడియా, కరీంనగర్**





భూభారతి చట్టం అమలులో భాగంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్, రాయికల్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి చర్చించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ, భూములకు సంబంధించి పేర్లలో పొరపాట్లు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూముల సమస్యలు, సర్వే నెంబర్ల మిస్సింగ్ వంటి అంశాలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.సైదాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. సదస్సుల్లో నమోదు చేయని వారు అనంతరం కూడా భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. క్లిష్టమైన భూ సమస్యలను తహసీల్దార్ల దృష్టికి తీసుకువచ్చి, నిర్ణీత గడువులోపే పరిష్కరించాల్సిన అవసరముందని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్, తహసిల్దార్లు కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**శిశువులకు నూతన ఆశ్రయం**

కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న 5 నెలల ఆడ శిశువును హైదరాబాద్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు దత్తతగా ఇవ్వడంతో పాటు, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌లో ఉన్న 13 ఏళ్ల బాలుడిని కరీంనగర్‌కు చెందిన దంపతులకు దత్తతగా అప్పగించారు. ఈ దత్తత కార్యక్రమం బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని, రక్త సంబంధీకుల నుండి కూడా దత్తత చట్ట ప్రకారం జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. దత్తతకు సంబంధించిన వివరాల కోసం భగత్‌నగర్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డిసిపిఓ పర్వీన్, పిఓ తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్విని, సీసీఐ నిర్వాహకురాలు సిరిల్, సోషల్ వర్కర్ రాజేష్ పాల్గొన్నారు.

# పహాల్గామ్ ఘటనను రాజకీయం చేయొద్దు

- అక్రమ వలసదారులను పంపించాలి
- బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు



**శెనార్తి మీడియా, జగిత్యాల :**

భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ జాతీయులను గుర్తించి వెంటనే దేశ బహిష్కరణ చేసేవిదంగా చర్యలు తీసుకోవాలని బిజెపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్బంగా బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు మాట్లాడుతూ పహాల్గామ్ ఘటన గురించి మోడీకి మూడు రోజుల ముందే తెలుసని అందుకే జమ్మూ కాశ్మీర్ పర్యటన రద్దు చేసుకున్నాడని ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కాంగ్రెస్ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనం అని విమర్శించారు. దాడి జరిగిన తర్వాత ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించడానికి మోడీ గారు చేస్తున్న ఒక్కొక్క ప్రయత్నం పాకిస్థాన్ కు కంటిమీద కునుకు లేకుండా చేస్తే సెక్యులజం ముసుగులో దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసే విదంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు.పాకిస్తాన్ దగ్గర అణు బాంబులు ఉన్నాయని దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని లేకుంటే భారత్ కు నష్టమని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించడం చూస్తే ఈదేశంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు దేశం వైపు ఉన్నారా లేదా తీవ్రవాదుల వైపు ఉన్నారా అనే అనుమానం కలుగుతుందని అన్నారు. పాకిస్థాన్ ఎలాంటి చర్యలకు పాల్పడ్డ భారత్ ఎదుర్కోవడానికి సిద్దంగా ఉందని దేశంలోని త్రివిధ దళాలు భరోసా ఇస్తున్నాయని పాకిస్తాన్ బాంబులు పెల్చితే భారత్ చూస్తూ ఊరుకోదని భారత్ కూడా బాంబులు పేల్చుతుందని అవి రాహుల్ గాంధీ పెళ్ళిలో పేల్చడానికి దాచుకోవడం లేదని ఏద్దేవా చేశారు. పహాల్గామ్ ఘటన ఇంటెలిజెన్స్ వైఫల్యం అంటున్న కాంగ్రెస్ నాయకులు మరి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, శ్రీపాద రావులను చంపినప్పుడు మీ ఇంటలిజెన్స్ ఏమైందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఉగ్రవాదులకు మద్దతుగ నిలవడం కాంగ్రెస్ కు కొత్తేమి కాదని 26/11దాడిలో వందల మంది చావుకు కారణం అయిన కసబ్ కు శిక్ష పడితే అర్ధరాత్రి సుప్రీం కోర్టు తలుపులు తెరిపించి న్యాయసహాయం అందించి కాపాడే ప్రయత్నం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. దేశంలో ఉగ్రవాదుల దాడి జరిగిన ప్రతిసారి సోనియా, రాహుల్ దేశంలో ఎందుకు ఉండడం లేదని వారు విదేశాలకు వెళ్ళగానే దాడులు జరగడం వెనకాల ఉన్న మర్మం ఏమిటో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర ముగింపు సందర్భంగా జమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాదులను అతిదగ్గరగా చూశానని వారు నాతో మాట్లాడాలి అన్నారని చెప్పిన వ్యాఖ్యలు గుర్తు చేసుకోవాలని ఉగ్రవాదులు కాంగ్రెస్ పార్టీకి ఏమైనా మేనల్లుళ్ళు అవుతారా ఏంటి అని అన్నారు.ఇప్పటివరకు భారత్ జరిపిన దాడుల్లో పాక్ సైన్యం, ఉగ్రవాదులు చనిపోతే పాక్ ధ్రువీకరించిన అదంతా డొల్ల అని ఆధారాలు చూపించమని భారత సైన్యాన్ని శంకించిన కాంగ్రెస్ పార్టీ డిఎన్ఏ లోనే దేశభక్తి లేదని దుయ్యబట్టారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలు భారత సైన్యం యొక్క ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేవిదంగా ఉన్నాయని ఉగ్రవాదంపై ఒక నిర్ణయాత్మకమైన దశకు చేరుకున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈసమావేశంలో బిజెపి నాయకులు నలువాల తిరుపతి, గుంటుక సదాశివ్,రుద్ర శ్రీనివాస్, జుంబర్తి దివాకర్, కొక్కు గంగాధర్, సుంకేటి దశరథరెడ్డి, మర్రిపల్లి సత్యం, ఓరుగంటి చంద్రశేఖర్,పిల్లి శ్రీనివాస్, జున్ను రాజేందర్, ఆముద రాజు, సిరికొండ రాజన్న, చిట్యాల రాము,గడ్డల లక్ష్మి పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

- నాలుగు క్వింటాళ్లు పట్టివేత

**శెనార్తి మీడియా, మంచిర్యాల (ఆసిఫాబాద్)**



జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాల రాకపోకలను అడ్డుకోవడంలో విజయవంతమయ్యారు. బుధవారం పెంచికల్పేట్ మండల శివారులో పోలీసులు నిర్వహించిన సోదాల్లో ప్రభుత్వ నిషేధిత నకిలీ బీటీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణ ప్రతాప్ వెల్లడించారు.

**నలుగురు అరెస్టు.. రెండు వాహనాల సీజ్**

నమ్మదగిన సమాచారం మేరకు పెంచికల్పేట్ బ్రిడ్జ్ వద్ద సోదాలు చేపట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు రెండు వాహనాలలో నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరిని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉషా సుబ్బారావు, కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన పలమరి సురేష్, భీమినీ మండలం దుబ్బగూడెం కు చెందిన రాచకొండ నగేష్, మంచిర్యాల జిల్లా సోమగూడెంకు చెందిన ఇనుముల రవిగా గుర్తించారు.

**రూ. 12 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు..**

ఈ దాడుల్లో నాలుగు క్వింటాళ్ల నకిలీ బీటీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాణ ప్రతాప్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. బ్రీజా కారు, ఎర్టిగా వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లో ఉంచినట్లు తెలిపారు.

**రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు..**

నకిలీ విత్తనాల సరఫరా ద్వారా అమాయక రైతులను మోసం చేసే ముఠా సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యవసాయ సీజన్‌లో నకిలీ విత్తనాల విక్రయాలు పత్తి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్లు మధు, రమేష్, మహమూద్, హోంగార్డ్ శేఖర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో అప్రెంటిస్షిప్ మేళా

- ఉద్యోగావకాశాలు లభ్యం

**శెనార్తి మీడియా, కరీంనగర్**

ప్రధాని జాతీయ అప్రెంటిస్ షిప్ స్కీమ్ ( ఎన్ ఎ పి ఎస్) కింద కరీంనగర్ ప్రభుత్వ ఐటిఐ ఉజ్వల పార్క్‌లో అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించబడుతోంది. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బహుళజాతీయ సంస్థలు, ఇంజనీరింగ్ కంపెనీలు ఖాళీలను భర్తీ చేయనున్నాయి. ఇందులో పాల్గొనదలచిన అభ్యర్థులు ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, సీవోపిఏ వంటి ట్రేడుల్లో ఐటిఐ పాస్ అయి ఉండాలి. అర్హత పత్రాలు, బయోడేటా, ఫోటో కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ. 8,000 నుండి రూ. 12,000 వరకు స్టైపెండ్ అందిస్తారు. అభ్యర్థులు తమ సొంత ఖర్చుతో మేళాకు హాజరు కావాలని అధికారులు తెలిపారు. కరీంనగర్ సహా పరిసర ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## డబుల్ బెడ్ రూమ్ జాబితాలపై అభ్యంతరాలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అర్హుల ఎంపికపై ప్రజల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారంతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగియడంతో పలువురు పుర కమిషనర్ రాజు కు ఫిర్యాదులు చేశారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అర్హుల జాబితాల్లో అనర్హుల పేర్లను తొలగించాల్సిందిగా బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు రామిడి ఉమాదేవి, జీలకర మహేష్ లు కోరారు. గతంలో విడుదల చేసిన జాబితాలో తమ వార్డుకు చెందిన నిరుపేదల పేర్లు ఉండగా, తాజా జాబితాలో అవి తొలగించి అనర్హులను చేర్చారని వారు ఆరోపించారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

**గడువు పొడిగింపు**

ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అర్హుల జాబితా ఎంపిక గడువును మరో రెండు రోజులు పొడిగిస్తున్నట్లు పుర కమిషనర్ రాజు ప్రకటించారు.

## ఎంఎస్ఎంఈలకు మద్దతు

- జిల్లాలో ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ సెంటర్లు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంస్థాగత మద్దతు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రకటించారు. ప్రపంచ బ్యాంకు మద్దతుతో తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పరిధిలో అన్ని జిల్లాల్లో ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రాలు మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ సదుపాయం, పోటీతత్వం పెంపొందించేందుకు అవసరమైన సేవలను అందించనున్నాయని తెలిపారు. ఇందుకోసం అర్హత, అనుభవం ఉన్న అభ్యర్థుల నుండి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. మేనేజ్మెంట్, కామర్స్, ఇంజినీరింగ్ రంగాల్లో గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా www.nimsme.gov.in] (http://www.nimsme.gov.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా నస్పూర్‌లోని ఎస్-25 లో గల జిల్లా పరిశ్రమల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

